# లక్ష్మణ గడ్డ

'ఎల్లోరా'

రాజమహేంద్రవరం మీదుగా గాని, నరసాపురం మీదుగా గాని, లేదా కోటిపల్లి మీదుగా గాని ఎటు వెళ్ళినా గోదావరి దాటవలసిందే! అలా దాటిన తరవాత తగిలే భూమినిగురించి చిత్రమైన కథ ఒకటి ఉంది!

అది రామాయణ కాలంనాటి గాథ!

"ఎలాగైతేనేం కైకేయి మాట నెగ్గింది! ఆమె దశరథునిచేత కోరిన కోరికలలో రాముని వనవాసం ఒక కోరిక!

మాట తప్పకుండా శ్రీరామచంద్రుడు నారబట్టలు కట్టుకొని తిన్నగా భార్యాసమేతంగా బయలుదేరాడు! వెంటనే లక్ష్మణుడు వెళ్లాడు. అలా అడవులూ, కొండలూ, గుట్టలూ దాటుకుంటూ కందమూలాల ఫలాలు తింటూ, చెట్ల నీడనే విశ్రాంతి తీసుకుంటూ నడక సాగించారు!

లక్ష్మణునికి అన్న శ్రీరాముని యందు ఎంతో ప్రేమ, భక్తి గౌరవమూను. సీతాదేవి ఎడల మరది లక్ష్మణునికున్న భక్తి అందరికీ తెలిసిందే కదా! అందుకే అలా నడిచి ప్రయాణం చేసేటప్పుడు వారికి సంబంధించిన ఒక మూట అటు అన్నగారుగాని, సీతాదేవిగాని మోయడం అతనికి యిష్టం లేదు! వారిమీద వుండే గౌరవభావంతో- వారిని పట్టుకోనివ్వకుండా ఎంత దూరమైనా అతడే మోసుకు వస్తూన్నాడు - ఇలాగుండగా - అన్న రాముడు-"లక్ష్మణా! ఎంత దూరమని నువ్వు ఈ బరువుని మోసుకు వస్తావు? నేను కొంచెం దూరం తీసుకు వస్తాను. తరవాత నువ్వే తీసుకురావచ్చును-" అన్నాడు!

"అబ్బే! నువ్వు పట్టుకురావడమేమిటి! ఒదిన, నువ్వు కబుర్లు చెప్పుకుంటూ ముందు నడవండి - ఈ మూట నేను మోయడం - నా మహాభాగ్యం!" అన్నాడు లక్ష్మణుడు.


సరే! అనుకొని రాములవారు ముందుకు నడక సాగించారు. అలా నడిచి తిన్నగా గోదావరిపాయ వశిష్ఠవద్దకు వచ్చారు. అంతవరకు శ్రీరామునియందు సీతయందు లక్ష్మణునికున్న భక్తి, ప్రేమ అప్రతిహతంగానే ఉన్నాయి!

వశిష్ఠానదిని దాటి మెల్లిగా ఇవతలకు చేరుకున్నారు- అదే ఈనాడు రాజవోలు తాలూకా ప్రాంతం అంటారు. రేవుదాటి అవతల అడుగు పెట్టగానే - అంతదాకా మూట మోసుకువస్తూన్న లక్ష్మణుడు - "అన్నా, రామచంద్రా! నువ్వూరికే చేతులు ఊపుకుంటూ నడవడమేమిటి! - నేను ఈ మూట మోసుకురావడమేమిటి - బాగా లేదు - కొంతదూరం నువ్వు తీసుకురా!" అన్నాడు!

చాలా ఆశ్చర్యపోయాడు శ్రీరాముడు. అంతదాకా మోస్తానన్న వద్దన్న లక్ష్మణుడు ఆ సమయంలో యిలా ఎందుకన్నాడా అని ఆలోచిస్తూ "సరే! మూట ఇలా ఇయ్యి!" - అని తీసుకొని - తిరిగి తిన్నగా నడక సాగించాడు!

తిరిగి అలా వెళ్ళగా, వెళ్ళగా గోదావరి మళ్లీ దాటవలసి వచ్చింది- ఆ గోదావరి దాటితే మొదట వచ్చేదే కోటిపల్లి! ఆ గోదావరిని దాటి - కోటిపల్లి గడ్డమీద అడుగు పెట్టారు. అంతదాకా మూటను మోసుకువస్తూన్నది శ్రీరాముడే!

గోదావరి దాటి కోటిపల్లి గడ్డ మీద అడుగుపెట్టిన క్షణంలోనే లక్ష్మణుడు "అన్నా! శ్రీరామచంద్రా! క్షమించు! మూట నువ్వు మోయడమేమిటి! పొరపాటు! ఇలా తే!" అని మూట తీసుకున్నాడు!

ఇది మరీ వింతగా, ఆశ్చర్యంగా తోచింది: ఏమిటి అక్కడ గోదావరి దాటినవెంటనే మూట నువ్వు మోయాలన్నాడు. ఇక్కడ గోదావరి దాటగానే నువ్వు మోయడం ఏమిటీ అంటున్నాడు అని ఆలోచించాడు!

"లక్ష్మణా! ఇది నీ తప్పు కాదు! నిన్ను క్షమించడానికి! అటు గోదావరి అవతల మహాభక్తితో మూట నెత్తిని పెట్టుకొచ్చావు — ఇటు గోదావరి దాటిన తరవాత అంతభక్తితోను మూటను తీసుకున్నావు! దీనికంతకూ కారణం ఆ గడ్డలోనే ఉంది. ఇది నీతప్పు కాదు" అన్నాడు శ్రీరామచంద్రుడు!


నాటినుంచీ ఆ ప్రదేశం "లక్ష్మణ గడ్డ" — అని గొప్పపేరు పొందింది! ★


ప్రస్ఫుటమైన శబ్దగ్రహణమునకు

ఝంకార్ రేడియో

(బిర్లావారి యాజమాన్యమున తయారైనవి)

కోరండి



POPULAR

కరసమైనధరలో ప్రఖ్యాతిగాంచిన రేడియో
అన్నిస్టేషనులనుండి వినవచ్చును.
5 వాల్వులు, 3 బ్యాండులు అందమైన వాల్ నట్ కాబినెట్టు.
A.C., A.C./D.C., డ్రైబ్యాటరీలలో దొరుకును. ధర రు. 180/-
ఆంధ్రకు సోల్ డిస్ట్రిబ్యూటర్లు:

టెరిటోరియల్ ఏజెన్సీస్,

పో. బా. నెం. 878, విజయవాడ-2.
ప్రాతినిధ్యము లేనిచోట్ల ప్రతినిధులు కావలెను.


# బంగారు పిట్ట

(47-వ పేజీ తరువాయి)

లించింది. రాముని తన తోకమీద కూర్చుండబెట్టుకుని, అతని దేశానికి సమీపంగా ఉన్న అడవిలో దించి, "ఇక నీవు క్షేమంగా నీ దేశానికి వెళ్లు. రాజుగారు నిన్ను ఆదరిస్తారు. సుఖంగా బ్రతుకు" అంది నక్క.

"నీ ఋణం వెయ్యి జన్మలెత్తినా తీర్చుకోలేను కదా!" అన్నాడు రాము.

"తీర్చుకోలేకేం? నాయందు నీకు నిజంగా స్నేహభావం వుంటే, నా కాళ్లు నరుకు. నాకదే చాలు" అంది నక్క.

విధి లేక రాము ఎలాగో నక్క కాళ్ళు నరికాడు.

విచిత్రం!

నక్క ఒక చక్కని రాకుమారుడుగా మారిపోయింది. ఆ రాకుమారు డెవరో కాదు—రాము వివాహమాడిన రాకుమారి అన్న! చిన్నతనంలో ఎప్పుడో తప్పిపోయి, శాపవశంచేత నక్కగా మారిపోయాడు. నేటికి శాపవిమోచన మైంది.

రాము తన బావమరిదితో తన దేశంలో అడుగుపెట్టాడు. వెంటనే రాకుమారి విచారం మానింది. పంచకల్యాణి ఆహారం ముట్ట నారంభించింది.

రాజుగారివద్దకు పోయి, జరిగినదంతా తూచా తప్పకుండా విన్నవించి, తనకు న్యాయం కలుగచేయవలసిందిగా ప్రార్థించాడు, రాము. రాజుగారు రాము అన్నలైన భీమా సోములు చేసిన మోసం గ్రహించి వారలకు తగిన శిక్ష విధించాడు. రాముకు ఘన సన్మానం చేశాడు. తన రాజ్యంలో సగభాగం రాముకిచ్చి అతడిని ఎంతో గౌరవించాడు.

రాజ్యంతోను, రాకుమారితోను రాము సుఖంగా ఉన్నాడు.

బంగారు పిట్టతో ప్రొద్దుపుచ్చుతూ రాజు సుఖంగా ఉన్నాడు.

బంగారు ఆపిలు పండ్లను స్వేచ్ఛగా భక్షిస్తూ బంగారుపిట్ట కూడా సుఖంగా ఉంది.

—"గ్రిమ్స్ ఫేరీటేల్స్" ★

"మా నాన్నకి రానురాను మరీ మతిమరుపు ఎక్కువౌతోంది."

"ఏం?"

"ఏమో మరి. పొద్దున్న ఊరెడదామని స్టేషనుకు వెళ్లాడు. అప్పుడు జ్ఞాపకం వచ్చిందట ఇంటిదగ్గిర రిస్టువాచి మరిచిపోయినట్టు. మళ్లీ ఇంటికి వచ్చి వాచి తీసుకువెళ్లడానికి టైముందో లేదోనని చేతికి ఉన్న వాచి చూసుకుని, ఇంకా టైముందిలే అనుకుని ఇంటికి వచ్చాడు." ★


మంచీ - చెడూ

వెల 2-0-0

పోస్టుఖర్చు ప్రత్యేకం

ఆంధ్రగ్రంథమాల,

మద్రాసు-1.